# ఢమాల్ !

ఉద్యోగాన్వేషణలో నేను వెళ్లిన మొదటి ఇంటర్వ్యూ అది !. ఛాంబర్లో ఒకే ఒక్క లావుపాటి వ్యక్తి కన్పించగానే విష్ చేశాను. బహుశ ఇతగాడే 'బాస్ కమ్' ప్రొప్రైటర్ అయివుంటాడేమో అన్పించింది.

'కూర్చోండి...' బొంగురుగొంతుతో శృతిలేకుండా అన్నాడు.

నేను ఆయనకెదురు సీట్లో కూర్చుంటుండగానే 'నేనీ కంపెనీకి ఎం.డి.ని! సోల్ ప్రొప్రైటర్ని! యాభైకోట్ల టర్నోవర్ వుంది. ఐయామ్ సద్గుణరావ్ !' తన గురించి కంపెనీ గురించి బ్రీఫ్ చేశాడు.

అయితే వీడే బాస్ అన్నమాట ! చూడముచ్చటగా గున్నఏనుగులా వున్నాడు. తొండమొక్కటే తక్కువ.... లేకపోతే పోతపోసిన విగ్రహాన్ని తలపిస్తాడు. ఏంతిటావురా తండ్రీ ఇంత పెద్ద పర్సనాలిటీకి ఓనరైనావ్ అనుకున్నాను.

'నీకు రావణాసురుడు తెల్సా?' అడిగాడు బాస్.

'పేరు విన్నాను పరిచయం లేదుసార్...'

'స్టుపిడ్ ! ఏమిటా కేర్‌లెస్ రిప్లై' గద్దించాడు.

అది సింహగర్జనలా... ఏనుగు ఘీంకారంలా వుంది.! భూకంపం వచ్చిందేమో అనేటంతగ భయంవేసింది. నా వీపు నేనే చరుచుకున్నాను. వీడికి హై బి.పి గానీ లేదుకదా... ఓ అరిచేస్తున్నాడు...

ఇహ ఇంతే సంగతులు ! సెలక్షన్ గోవిందే ! నన్ను తిట్టినందుకు ఏడుపు తన్నుకొచ్చింది. వెక్కివెక్కి ఏడవాలన్పించింది... కానీ ఇది ఇంటర్వ్యూ కదా? ధైర్యంచెయ్యలేకపోయాను. ఎదురు తిరిగి తిట్టటానికి !

జాబ్ కదా?... పాతికవేల జీతం... ఈ అవకాశాన్ని ఏ వెధవా వదులుకోడు ! అందునా వుద్యోగం దొరక్క నానా యాతన పడుతున్న ఈరోజుల్లో.. దీని కాదనుకుంటే నాకు గృహ బహిష్కరణే !

మరో రెండు మూడు ప్రశ్నలేవో అడిగాడు సమాధానం కరెక్ట్‌గా ఇచ్చానో లేదో సరిగ్గా గుర్తులేదు.

'యు కెన్ గో...' మెడపట్టి గెంటినట్టు హుకుం జారీ' చేయటంతో బతుకుజీవుడాని బైటికొచ్చిపడ్డాను.

మూడోరోజుకల్లా పోస్ట్‌లో అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చినందుకు నా మనసు పిల్లిమొగ్గలేసింది. ఫ్యామిలీ అంతా తెగసంతోషించింది. ఇహ... మనవాడికి పెళ్లిచేసెయ్యొచ్చు అనేసి డాడీ మమ్మీతో అన్నాడు.

కానీ నేనెలా సెలక్ట్ అయ్యానో నాకే అర్థం కాలేదు. అద్సరే.. రాక్షసుడిలాంటి బాస్ దగ్గర వుద్యోగం చేసి నెగ్గుకురాగలననే భయం నన్ను కుదిపేసింది.

ఎలాంటివాడైనా... బాస్ సేవలో తరించాల్సిందే... తప్పదు.. లేకుంటే నోట మట్టే !

చేతిలో అపాయింట్‌మెంట్ ఆర్డర్‌తో పర్వతంలాంటి బాస్ ముందు చిట్టెలుకలా నిలబడి నమస్కరించాను.

'నువ్వు జి.కె.లో వెరీ పూర్. అయినా నీ క్వాలిఫికేషన్ చూచి అపాయింట్ చేశాను. నా ఆఫీసులో రూల్సు స్ట్రిక్ట్ !. అతిక్రమిస్తే ఏ క్షణంలోనైనా వూస్టింగే...' భళ్లున నవ్వాడు. అది నవ్వులాలేదు. రాక్షసుడి రంకెలా అన్పించింది.

బుద్ధిమంతుడిలా తలూపి 'యస్సార్' అన్నాను. ఎస్సై ముందు నిలబడిన కానిస్టేబుల్ లాగ.

'చూడూ! నీ అతివినయం నాకు నచ్చదు. కొలీగ్స్‌తో ఆఫీస్ అవర్స్‌లో హరికథలు చెప్పకూడదు. ఛిట్‌ఛాటింగ్ నిషిద్ధం ! అలాచేశావంటే ఎంగిలి విస్తరాకులా కిటికీలోంచి బైటికి విసిరేస్తాను ! నోరు మూసుకుని... తలవంచుకుని పన్చెయ్యాలి. ఆఫీసులో పెళ్లికాని లేడీస్ వున్నారు. వాళ్లముందు నువ్వు హీరోలా పోజులివ్వకు. నవ్వకు... కన్నుగీటకు... వాళ్లని పిక్చర్లకి... పబ్బులకు ఇన్వైట్ చెయ్యకు. నువ్వు లవ్వులో పడ్డావని తెలిస్తే... నువ్వు కేరాఫ్ హుస్సేన్‌సాగరే... అండ్రస్టాండ్...'

అర్థం కాకపోవటమేంటి? వళ్లంతా... ఎ.సి. రూములో వున్నా... ముచ్చెమటలు పడితే!. ఆయన మాటలు వింటుంటే... పెనం మీదనుండి పొయ్యిలో పడ్డట్టన్పించింది!. మనసు బాధతో తన్నులు తిన్న కుక్కలా కుయ్యో... కుయ్యోని మూల్గింది.'

ఇలాంటి ఆఫీసులో వుద్యోగం చేయగలనాని మనసు మూగగా రోదించింది.

'గో'.... వెళ్లి సీట్లో కూర్చుని వర్క్ స్టార్ట్ చెయ్... ఇన్‌ఛార్జ్ నీకు అన్ని వివరాలు

ఎక్స్‌ప్లెయిన్ చేస్తాడు...' అనగానే దభీమని బైటికికొచ్చి పడ్డాను.

ఒక సీనియరు... నన్ను తీసుకెళ్లి ఖాళీగా వున్న చైర్లో కూర్చోమని సైగ చేశాడు. ఆఫీసులో అందరిదీ మూగనోమే కాబోలన్పించింది ! నోరెత్తకూడదనే విషయం బోధపడింది.

నాకేసి ఎవ్వరూ చూడలేదు. పరిచయం చేసుకోలేదు. బధిరుల పాఠశాలలోనో... హాస్టల్లోనో వున్నట్టన్పించింది. ఇలాంటి ఆఫీసులో ఆర్నెల్లు వర్క్ చేస్తే చాలు పిచ్చెక్కుతుందనే భయం కలిగింది.

బాస్ పేరు సద్గుణరావే అయినా, ఆయనగారిలో అన్నీ దుర్గుణాలే ! రాక్షసావతారంలో వున్న మానవుడు. తన సొంత కంపెనీ కావటాన సబార్డినేట్సుని పురుగుల్లా చూస్తాడు. చీదరించుకుంటాడు. బండ బూతులు తిడతాడు. తిరగబడిన వూస్టింగే!.

పట్టుమని ఏడాది ఆఫీసులో పనిచేసిన వారెవరూ లేరనే విషయం చేరిన మూడోరోజే తెల్సింది.

బాస్ దెబ్బకు తట్టుకోలేని వాళ్లు చెప్పపెట్టకుండా పారిపోతూంటారట ! మరి నా ఖర్మ ఎలా కాలనున్నదో.

మా ఇంటి పక్కనే జాతకాలు చెప్పే సిద్ధాంతిగారికి నా హారస్కోప్ చూపించి 'అయ్యా ఈ మందభాగ్యుడికి రిటైరయ్యేదాకా వుద్యోగం చేసుకు బ్రతికే అవకాశం వున్నదో లేదో కాస్త నా జాతకం క్షుణ్ణంగ పరిశీలించి చెబ్దురూ' దీనాతి దీనంగ వేడుకున్నాను.

'నువ్వు కుక్కలా విశ్వాసం కలవాడివి ! తిట్టినా... కొట్టినా దులిపేసుకునే స్వభావం నీది. గ్రహవీక్షణ అద్భుతంగ వుంది కాబట్టి నీ వుద్యోగానికి ఢోకా లేదు.... పదిసార్లు హరస్కోప్ పరిశీలించి మరీ చెప్పాడు సిద్ధాంతి. బతుకు జీవుడానుకున్నాడు.

వుద్యోగంలో జాయినైన ఆర్నెల్లకు మొదటిసారిన ఆఫీసుకు లేటుగ వెళ్లాను. దారిపొడుగునా భయంతో వణికిపోతునే వున్నాను. ఛేంబర్లోని గ్లాస్ విండోస్ పగిలిపోయేటంత పెరాలసిస్ స్ట్రోక్ నోటికొచ్చినట్టన్పించి నోటమాటకరువైంది.

బాసేమో ఆఫీసు పీకి పందిరేశాడు. నేను కిక్కురుమన్లేదు. ఆయన మాత్రం కల్లు తాగిన కోతిలా కుర్చీలోంచి లేచి చిందులేస్తూ ఛేంబరంతా కలియతిరుగుతూనే

వున్నాడు... నాన్‌స్టాప్‌గ తిడుతూనే వున్నాడు.

నేను మనసులో అంజనేయ దండకం పఠిస్తూ తలొంచుకు నిలబడ్డాను సేవకుడిలా... భృత్యుడిలా... ఫైరైనవాడల్లా కూలింగ్ కండిషన్లోకి రావటానికి అర్థగంటపట్టింది బాస్‌కు.

కాస్త అలుపు తీర్చుకుని... హైరానపడ్డ బాస్ స్థిమితపడి 'మిస్టర్ రావ్! నువ్వు లేట్‌గ వచ్చి నా మూడ్ పాడుచేశావ్'... బైదిబై ఇదిగో నా మ్యారేజి ఇన్విటేషన్. అందరికీ పర్సనల్‌గానే ఇచ్చాను' వెడ్డింగ్ కార్డ్ అందించాడు.

యాభై గుడ్లు... అరడజను కోళ్లు.... పది కేజీల బిర్యానీ అలవోకగ తిని హరాంచుకోగల బాస్‌కు వచ్చే పెళ్లాం... ఏ తాటకి లాగానో... పూతన లాంటిదో ఐ వుండాలి అనుకున్నాను. మనసులో ఫీలింగ్స్ బహిర్గతం కాకుండా జాగ్రత్తపడ్డాను.

మొట్టమొదటిసారి ఆఫీసులో స్టాఫ్ గుమి కూడి బాస్ మ్యారేజ్‌కి ప్రజెంటేషన్ కొనే విషయంలో తర్జన భర్జన పడనారంభించారు.

అందరు ఇచ్చే డబ్బుతో బాస్‌కి బ్రాసిలెట్టో... మెడలోకి గోల్డ్ చైనో తీసుకుంటే బాగుండునని కొందరు... ఎవరికివారే విడివిడిగ ఎవరికి తోచిన గిఫ్ట్ వారిచ్చే పద్ధతే బాగుంటుందని కొందరు అభిప్రాయపడ్డారు. ఏకాభిప్రాయం కుదరక చివరికి రాష్ట్ర విభజన సమస్యలా తయారైంది.

టీచర్ లేని క్లాసులో పల్లల్లాగ... గొడవగా వుంది ఆఫీసు వాతావరణం ! హెడ్మాస్టర్లా సడన్‌గ హాల్లోకి బాస్ ఎంట్రీ ఇవ్వటంతో అందరి నోళ్ళకు తాళాలు పడినయ్! ఎవరి సీట్లో వారుండిపోయారు. కిక్కురుమనకుండా కుక్కిన పేనుల్లా... చచ్చిన పీనుగుల్లా!

'వాటీజ్ దిస్ ? ఇది ఆఫీసా ఫిష్ మార్కెట్టా ? ఐ డోన్ట్ స్పేర్ ఇన్‌డిసిప్లిన్...' బి.పి. వచ్చినవాడిలా గావుకేకలుపెట్టాడు.

'నా మ్యారేజికి గిఫ్టలేం కొనకండి. ప్రజెంటేషన్ పుచ్చుకునే ఓల్డ్ ట్రెడిషన్‌కు నేను వ్యతిరేకిని! కేవలం మీ ఇన్ఫర్మేషన్ కోసమే వెడ్డింగ్ కార్డ్స్ ఇచ్చానంతే !.' మళ్లీ బాసే కేకవేశాడు.

స్టాఫంతా నిందితుల్లా తలలొంచుకున్నారు వాడిన క్రోటన్ మొక్కల్లాగ.

'టెండర్స్ కేసుల్లో కొటేషన్స్ ఫైలింగ్ ఈరోజే. వాటిని అప్డేట్ చేసి నా సంతకాలకు పట్రండి ! మనదే లోలోయస్ట్ కావాలి ! మన కంపెనీకి ఆర్డర్స్ రాకుంటే కోట్లలో నష్టం

జరిగిపోతుంది. గెట్ రెడీ...' ఆయాసపడుతూ... రొప్పుతు... రోజుతూ.. చెప్పి నిష్క్రమించాడు బాస్ తన ఛాంబర్‌లోకి.

ఇతగాడి వయసుకి... పర్సనాలిటీకి.... మ్యారేజి కావలసి వచ్చిందా ?... శుద్ధ వేస్ట్ ! వచ్చే మాహా ఇల్లాలు ఏం సుఖపడి ఏడుస్తుంది ఈ రాక్షసుడితో?. గంతకు తగిన బొంత అవుతుందంతే ! ఆమె కూడా రోడ్‌రోలర్‌లాగో.... బుల్‌డ్రోజర్‌లాగో ఉండివుంటుంది. పెళ్లి కేవలం తోడుకోసమేగాని సుఖం కోసం అయివుండదు. ఇంతోటి పెళ్లికి వెళ్లకపోవటమే నయం అనుకున్నాను.

ఓ గంట దాటేక టెండర్ల ఫైళ్లతో బాస్ ఛాంబర్లోకెళ్లాను. బాస్ గుడ్లు తేలేసి చలనం లేకుండా ఛైర్లో వుండటం చూచిన నాకు భయంవేసి హాల్లోకెళ్లి స్టాఫందరితో చెప్పాను.

అందరం లోనికెళ్లాం. కంగారుపడుతూ డాక్టర్‌కి ఫోన్ చేసి రమ్మన్నాం!

హై బి.పి. వల్ల హార్ట్ ఎటాక్ వచ్చి సడన్ కొలాప్స్ అయి మరణించాడని డాక్టర్ ధృవీకరించాడు.

అంటే... బాస్... ఢమాలా ? ఇంకానయం పెళ్లి జరిగేక పోయాడు కాదు. ఆవిడ అదృష్టవంతురాలు !. బాస్ కోపంతో అరిచే లక్షణం చూచి అప్పుడే లనుకున్నాను.... వీడొక బి.పీ. పేషెంట్ అని ఎక్కువ కాలం బ్రతకడనీ !

అనుకున్నంతా అయింది ! బాస్ పోవటంతో ఆఫీసు మూతబడటంతో స్టాఫ్ అందరికీ ఉద్యోగాలు ఢమాల్ !!

--- సమాప్తం ---